తెలంగాణ సంప్రదాయాలను పట్టించుకోని గత ప్రభుత్వాలు

ఆబ్కారీ, పర్యాటక శాఖ మంత్రి శ్రీనివాసగౌడ్

హైదరాబాద్, సెప్టెంబరు 26, ప్రభాతవార్త: ఉమ్మడి రాష్ట్రంలో గత ప్రభుత్వాలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను నిర్లక్ష్యానికి గురి చేశాయని రాష్ట్ర ఆబ్కారీ, పర్యాటక శాఖ మంత్రి వి.శ్రీనివాసగౌడ్ అన్నారు. ప్రకృతిని, పూలను పూజించే సంస్కృతి ప్రపంచంలో ఒక్క తెలంగాణకే సాధ్యమని పేర్కొన్నారు. సోమవారం తెలంగాణ సంగీత నాటక అకాడమి ఆధ్వర్యంలో మంత్రి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు బతుకమ్మ పండుగను రాష్ట్ర పండుగగా నిర్వహిస్తున్నామని చెప్పారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఎమ్మెల్సీ కవిత దేశవిదేశాల్లో బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించి విశ్వవ్యాప్తం చేశారని చెప్పారు. బతుకమ్మ పండుగను మహిళలు, ఉద్యోగినులు ఘనంగా నిర్వహించుకునేలా బతుకమ్మ సంబురాలలో భాగంగా దేవి వైభవ నృత్యోత్సవంను ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున అన్ని ఏర్పాటు చేశామని చెప్పారు. అనంతరం ప్రముఖ నర్తకీమణులు డా.ఆనంద్‌శంకర్ జయంత్, మంగళ భట్, ప్రొ.ఆలేఖ్య పుంజలను సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డా.కెవి రమణాచారి, సాంస్కృతిక సారథి చైర్మన్ రసమయి బాలకిషన్, తెలంగాణ అధికార భాషా సంఘం చైర్ పర్సన్ మంత్రి శ్రీదేవి, సంగీత నాటక అకాడమి చైర్మన్ దీపికారెడ్డి, సాంస్కృతిక శాఖ సంచాలకులు డా.మామిడి హరికృష్ణ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవితతో బ్రిటిష్ డిప్యూటీ హైకమిషనర్ భేటీ

ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, సెప్టెంబరు26: హైదరాబాద్‌లో బ్రిటీష్ డిప్యూటీ హైకమిషనర్ గారెత్‌విన్ ఓవెన్ ఎమ్మెల్సీ కవితను హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గారెత్‌విన్ ఓవెన్‌కు శుభాకాంక్షలు తెలియజేసిన ఎమ్మెల్సీ కవిత, పలు అంశాలను చర్చించారు. సిఎం కెసిఆర్ నాయకత్వంలో తెలంగాణలో అభివృద్ధి, అభివృద్ధి అవకాశాలతోపాటు పలు అంశాలపై విస్తృతంగా చర్చించినట్లు ఎమ్మెల్సీ కవిత తెలిపారు.

విఆర్‌ఎల సమస్యలను వెంటనే పరిష్కరించండి

వారి పోరాటానికి అండగా బిజెపి : గూడూరు నారాయణరెడ్డి

హైదరాబాద్, సెప్టెంబరు 26, ప్రభాతవార్త: గ్రామ రెవెన్యూ సహాయకులు(విఆర్‌ఎ) సమస్యలను వెంటనే పరిష్కరించాలని బిజెపి సీనియర్ నేత గూడూరు నారాయణరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ఈమేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. తమ సమస్యలను పరిష్కరించాలంటూ డిమాండ్ చేస్తూ 64 రోజులు నుంచి సమ్మె చేస్తున్నాన్నారు. ఇప్పటికే 34 మంది ఆత్మహత్యలు, అనారోగ్య కారణాతో ప్రాణాలు కోల్పోయారన్నారు. భవిష్యత్తుపై భయంతో మానసిక ఒత్తిడికి గురై ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీరికి గత రెండు నెలలుగా గౌరవ వేతనం ఇవ్వలేదని, చాలా మంది విఆర్‌ఏలు ఆర్థికంగా చితికిపోయి వారి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారన్నారు. విఆర్‌ఏలకు ఇతర ప్రభుత్వ సిబ్బందితో సమానంగా వేతనాలు, అర్హులైన విఆర్‌ఏలకు పదోన్నతులు, 55 సంవత్సరాలు దాటిన విఆర్‌ఎల వారసులకు ఉద్యోగాలు, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇస్తామని సిఎం కెసిఆర్ అసెంబ్లీ వేదికగా ప్రకటించారన్నారు. రెండు సంవత్సరాలుగా డిచిన ఇప్పటి వరకు ఉత్తర్వులు జారీ చేయలేదన్నారు. 23వేల మంది గ్రామ రెవెనూన సహాయకులు పోరాట మార్గంలో ఉన్నారన్నారు. వారికి ఇతర శాఖల్లో సర్దుబాటు చేస్తామని ప్రభుత్వం ప్రకటించి చాలా రోజులు అయిందని ఇంకా పని పూర్తికాలేదన్నారు. విఆర్‌ఏలు లేకపోవడంతో పంచాయతీలలో పరిపాలన కుంటుపడిందన్నారు. తహశీల్దార్లు, డిప్యూటీ తహశీల్దార్లు పనిభారం భరించలేక ఇబ్బందులు పడుతున్నాన్నారు. గ్రామాలలో ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. విఆర్‌ఏలకు బిజెపి అండగా ఉంటుందని, వారి సమస్యలపై తక్షణ పరిష్కారం కోసం వారి తరుపున పోరాటం చేయాలన్నారు. మంత్రి కెటిఆర్ విఆర్‌ఏలతో చర్చించి వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు.

అక్టోబర్ 11 నుంచి ఎంసెట్ రెండోదశ కౌన్సెలింగ్

- సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ నవీన్‌మిట్టల్

హైదరాబాద్, సెప్టెంబరు 26, ప్రభాతవార్త: రాష్ట్రంలో ఎంసెట్-2022 ఇంజనీరింగ్ సెకండ్ ఫేజ్ కౌన్సెలింగ్ వాయిదా పడింది. సెప్టెంబర్ 28 నుంచి ప్రారంభం కావల్సిన కౌన్సెలింగ్‌ను అక్టోబర్ 11 నుంచి ప్రారంభించనున్నారు. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను సాంకేతిక విద్యా శాఖ కమిషనర్, ఎంసెట్ అడ్మిషన్ల కన్వీనర్ నవీన్ మిత్తల్ సోమవారం విడుదల చేశారు. అక్టోబర్ 11, 12 తేదిల్లో విద్యార్థులు తమ వివరాలను అప్‌లోడ్ చేసుకోవడానికి అవకాశం కల్పించారు. అక్టోబర్ 12న సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఉంటుంది. అక్టోబర్ 12, 13 తేదిల్లో వెబ్ ఆప్షన్లకు అవకాశమిచ్చారు. అక్టోబర్ 16న సీట్ల కేటాయింపు చేస్తారు. అక్టోబర్ 16 నుంచి 18 వరకు సీట్లు పొందిన విద్యార్థులు ట్యూషన్ ఫీజు చెల్లించి సెల్ఫ్‌రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుందని నవీన్ మిత్తల్ తెలిపారు. గతంలో ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం సెప్టెంబర్ 28న వివరాల నమోదు.. అక్టోబర్ 4న సీట్ల కేటాయింపు.. అక్టోబర్ 8 వరకు సెల్ఫ్‌రిపోర్టింగ్‌కు అవకాశమిచ్చారు. అయితే రాష్ట్ర వ్యాప్తంగా అక్టోబర్ 2 నుంచి 9 వరకు దసరా సెలవులు ఉన్నందున షెడ్యూల్‌లో మార్పులు చేశారు.

కమ్యూనిస్టులు అంటే రేవంత్‌కు అపారగౌరవం

పిసిసి సీనియర్ ఉపాధ్యక్షుడు మల్లు రవి

హైదరాబాద్, సెప్టెంబరు 26, ప్రభాతవార్త: మునుగోడు ఉపఎన్నికలలో కమ్యూనిస్టులు అమ్ముడుపోయారని పిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి విమర్శించారని సిపిఐ, సిపిఎం నాయకులు ప్రకటనలు చేశారని, కమ్యూనిస్టు పార్టీలను రేవంత్‌రెడ్డి విమర్శించలేదని టిపిసిసి సీనియర్ ఉపాధ్యక్షులు మల్లు రవి అన్నారు. కమ్యునిస్టులను విమర్శించలేదని, అమ్ముడు పోయారని మాట వాడలేదని కావాలంటే అందుకు సంబంధించి వీడియోలు చూడాలని మల్లు రవి అన్నారు. సోమవారం టిపిసిసి అధ్యక్షులు రేవంత్‌రెడ్డితో భేటి అయన అనంతరం సిపిఐ, సిపిఎం నాయకులతో ప్రత్యేక మాట్లాడారు. ఈ విషయంపై మల్లు రవి మాట్లాడుతూ కాంగ్రెస్ కమ్యునిస్టులు సహజమిత్రులని దేశానికి స్వాతంత్ర్య కోసం రెండు పార్టీలు పోరాటాలు చేశారన్నారు. అనేక సందర్భాల్లో కాంగ్రెస్ పార్టీకి కమ్యునిస్టులు అండగా నిలబడ్డారని అన్నారు. అంతేకాకుండా రేవంత్‌రెడ్డికి కమ్యునిస్టులు అంటే ప్రత్యేక అభిమానం, గౌరవం ఉందన్నారు. కమ్యూనిస్టులు పేదల కోసం ఏళ్ల తరబడి అనేక పోరాటాలు చేశారని వారి సిద్దాంతాలను అమలు చేసేందుకు కాంగ్రెస్ ప్రధానులు నెహ్రూ, ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ, పివి నర్సింహారావు, మన్మోహన్‌సింగ్‌లు యుపిఏ చైర్‌పర్సన్ సోనియాగాంధీలు అనేక సంస్కరణలు చేశారని వివరించారు. ఇప్పుడు దేశంలో ఉన్న రాజకీయ పరిస్థితులను తట్టుకుని బిజెపి మతతత్వ రాజకీయాలను అడ్డుకునేందుకు కమ్యునిస్టులతో కాంగ్రెస్ పార్టీ కూటమని కట్టే దిశగా వెళ్తున్నారని అన్నారు. రేవంత్‌రెడ్డికి కమ్యునిస్టులను కించపరిచే ఉద్దేశం లేదని కమ్యునిస్టుల పార్టీలు రేవంత్ రెడ్డిపై అపోహలు పడవద్దని అన్నారు.

యాజమాన్యాల వారీగా పదోన్నతులు కల్పించాలి

- 13 జిల్లాల స్పాజ్ అప్పీళ్లను పరిష్కరించాలి
- పిఆర్‌టియు రాష్ట్ర కార్యవర్గం తీర్మానం

హైదరాబాద్, సెప్టెంబరు 26, ప్రభాతవార్త: రాష్ట్రంలోని ప్రభుత్వ, పంచాయతీరాజ్ ఉపాధ్యాయులకు యాజమాన్యాల వారీగా న్యాయ వివాదాలు లేని పోస్టులకు పదోన్నతులు కల్పించాలని పీఆర్‌టీయూ తెలంగాణ రాష్ట్ర కార్యవర్గం తీర్మానించిందని సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం చెన్నయ్య, ప్రధాన కార్యదర్శి అంజిరెడ్డి తెలిపారు. సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం చెన్నయ్య అధ్యక్షతన సోమవారం జరిగిందని తెలిపారు.

సమావేశంలో పీఆర్‌టీయూ వ్యవస్థాపకులు, శాసనమండలి మాజీ చీఫ్ విఫ్ పాతూరి సుధాకర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 13 జిల్లాలకు సంబంధించిన పెండింగ్‌లో ఉన్న స్పాజ్ కేటగిరీ అప్పీళ్లను పరిష్కరించాలని సమావేశంలో తీసుకున్న తీర్మానం చేసినట్టు చెప్పారు. పంచాయతీరాజ్ ఉపాధ్యాయుల సర్వీసును లోకల్ క్యాడర్‌గా ఆర్గనైజ్డ్ చేస్తూ, జిల్లా పరిషత్ వ్యవస్థలోనే నూతన సర్వీస్ నిబంధనలు రూపకల్పన చేసి, జిల్లా పరిషత్ పరిధిలోనే ప్రతి మండలానికి తప్పనిసరిగా ఎంఈవో లను, అసెంబ్లీ నియోజక వర్గానికి డిప్యూటీఈవోలను, జిల్లా స్థాయిలో డీఈవోలను ఏర్పరుస్తూ నూతన నియమ నిబంధనలు రూపొందించాలన్నారు.

పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయుల రేషనలైజేషన్ చేపట్టాలని తీర్మానించినట్టు చెప్పారు. ప్రతినెలా 1వ తేదిన వేతనాలు చెల్లించాలని, ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్న అన్ని రకాల బిల్లులను వెంటనే చెల్లించాలన్నారు.

చాకలి ఐలమ్మ చిత్ర పటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటిస్తున్న సిఐడి చీఫ్ గోవిందసింగ్, అదనపు డిజిపి శివధర్‌రెడ్డి, ఐజి విక్రంసింగ్‌మాన్ తదితరులు.

డిజిపి కార్యాయంలో చాకలి ఐలమ్మ జయంత్యుత్సవాలు

హైదరాబాద్, సెప్టెంబరు 26, ప్రభాతవార్త: తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ 127 వ జయంతి ఉత్సవాలు సోమవారం డిజిపి కార్యాలయం లో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఐలమ్మ చిత్ర పటానికి సిఐడి చీఫ్ గోవింద్ సింగ్, అదనపు డిజిపి (పర్సనల్) శివధర్ రెడ్డి, ఐజిపి విక్రం సింగ్ మాన్ తదిత రులు పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. తెలంగాణ సాయుధ పోరాటంలో రజాకర్లను ఆమె ఎ దురించిన తీరును వారు కొనియాడారు.

రేపు జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంలో బతుకమ్మ సంబురాలు

- మేయర్ గద్వాల విజయలక్ష్మి

హైదరాబాద్, సెప్టెంబరు 26, ప్రభాతవార్త: బతుకమ్మ సంబరాలను పురస్కరించుకుని జహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులతో ఈనెల 28వ తేది సాయంత్రం 4.30గంటలకు బతుకమ్మ పండగ వేడుకలు నిర్వహిస్తున్నట్లు మేయర్ గద్వాల విజయలక్ష్మి తెలిపారు. బతుకమ్మ పండగ వేడుకలలో మహిళా ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు. ప్రతి హెచ్‌ఓడిలు బాధ్యత తీసుకుని మహిళా ఉద్యోగులు పాల్గొనే విధంగా చర్యలు తీసుకోవాలని, ఈ కార్య క్రమంలో డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి అదనపు కమిషనర్లు, జోనల్ కమిషనర్లు పాల్గొంటారని మేయర్ తెలిపారు.

దసరా సెలవుల తర్వాతే సిడబ్ల్యుఎస్‌ఎన్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించాలి

ప్రభుత్వానికి ఉపాధ్యాయ సంఘాల డిమాండ్

హైదరాబాద్, సెప్టెంబరు 26, ప్రభాతవార్త: రాష్ట్రంలో సోమవారం నుంచి ప్రారంభించిన చిల్డ్రన్ విత్ స్పెషల్ నీడ్స్(సీడబ్ల్యూఎస్ఎన్) శిక్షణా కార్యక్రమాన్ని వాయిదా వేయాలని ఉపాధ్యాయ సంఘాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. 26 నుంచి 30 వరకు 5 రోజులపాటు కొనసాగించనున్న జూమ్ శిక్షణా కార్యక్రమాన్ని వాయిదా వేయాలని టీపీటీఎఫ్, ఎస్‌టీయూటీఎస్, డీటీఎఫ్, తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం, టీయూటీఎఫ్ సంఘాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. శిక్షణా కార్యక్రమం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జూమ్ ద్వారా నిర్వహించాలని నిర్ణయించారని.. అయితే సోమవారం నుంచే పాఠశాలలకు దసరా సెలవులు ఇచ్చిన నేపథ్యంలోఉ ఉపాధ్యాయులు చాలా మంది గ్రామాలకు వెళ్లారని.. కానీ శిక్షణ అంటే వారు తిరిగి డ్యూటీలో ఉన్నట్టుగానే ఉండాల్సి వస్తుందని ఈ నేపథ్యంలో వాయిదా వేయాలని సంఘాల నాయకులు కోరుతున్నారు. సీడబ్ల్యూఎస్ఎన్ శిక్షణా కార్యక్రమం ప్రత్యేక అవసరాలు ఉన్న విద్యార్థులకు ఉపయోగపడుతుందని.. కానీ పాఠశాలలకు సెలవులు ఇచ్చి .. జూమ్ మీటింగ్ ద్వారా ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జూమ్ మీటింగ్ ద్వారా శిక్షణను నిర్వహించనున్నారని గుర్తు చేశారు. మహిళలకు ముఖ్యమైన బతుకమ్మ పండుగకు చాలా మంది ఊర్లకు వెళ్లారని.. కాబట్టి శిక్షణా కార్యక్రమాన్ని దసరా పండుగ సెలవుల అనంతరం ఏర్పాటు చేయాలని సంఘాల నాయకులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

షర్మిల పాదయాత్రతో సంగారెడ్డిలో రాజకీయ వేడి

పాదయాత్రలో మాట్లాడుతున్న వైఎస్ షర్మిల

సంగారెడ్డి బ్యూరో, సెప్టెంబరు 26, ప్రభాతవార్త: వైఎస్ఆర్‌టిపి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల సంగారెడ్డి నియోజకవర్గంలో చేపట్టిన ప్రజా ప్రస్థానం యాత్ర రాజకీయ వేడిని పుట్టిస్తున్నది. పాదయాత్ర సందర్భంగా సంగారెడ్డిలో మాట్లాడిన షర్మిల జగ్గారెడ్డిపై తీవ్ర రాజకీయ విమర్శలు చేశారు. ఉదయం ఓ పార్టీ, మధ్యాహ్నం ఓ పార్టీ, సాయంత్రం ఓ పార్టీ మారే జగ్గారెడ్డి నియోజకవర్గం సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించారా అని ఆమె నిలదీశారు. రైతుసమస్యలపై ఏనాడైన ప్రభుత్వాన్ని ప్రశ్నించావా అంటూ నిలదీశారు. తనపై ఘాటైన విమర్శలు చేయడంతో స్పందించిన జగ్గారెడ్డి సోమవారం సిఎల్పీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో తీవ్రంగా స్పందించారు. టీఆర్ఎస్‌తో పనిచేసుకుంటూ ఉన్న తనను పిలిచింది వైఎస్ అని, ఆ సంగతి షర్మిలకు తెలియదా అని ప్రశ్నించారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఏమి చేశాడో తెలిసుకోకుండా షర్మిల మాట్లాడుతుందంటూ మండిపడ్డారు. వైఎస్‌ను అభిమానించే తనను వ్యక్తిగతంగా రెచ్చగొడితే ఊరుకోనని హెచ్చరించారు. ఇదిలా ఉండగా కంది మండలంలో పాదయాత్రలో పాల్గొన్న షర్మిల మాట్లాడుతూ ప్రజలకోసం ఒక్కరోజైన కోట్లాడావా అని ప్రశ్నించారు.

వైఎస్ షర్మిల బిజెపి వదిలిన బాణమే

రాహుల్‌ను ప్రధానిగా చూడాలన్నదే వైఎస్ ఆఖరి కోరిక
ఎమ్మెల్యే జగ్గారెడ్డి సంచలన వ్యాఖ్యలు

హైదరాబాద్, సెప్టెంబరు 26, ప్రభాతవార్త: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీని ప్రధానిగా చూడాలన్నదే వైఎస్ఆర్ ఆఖరి కోరిక అని ఎమ్మెల్యే జగ్గారెడ్డి అన్నారు. సోమవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడారు. ఈ సందర్భంగా వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలపై మండిపడ్డారు. తండ్రి అడుగుజాడల్లోనే మీరు నడుస్తున్నారా? అన్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి వారసులుగా జగన్, వైఎస్ షర్మిలలు ఇద్దరు తండ్రి ఆశయాలు నెరవేరుస్తున్నారా అంటూ ప్రశ్నించారు. ఆస్తుల దగ్గర వైఎస్‌కి శ్రద్ధాంజలి అప్పుడు జగన్, షర్మిలు కలిసే ఉంటారన్నారు. రాజకీయ వరకు వచ్చే సరికి ఇద్దరు వేరువేరు అంటున్నారు. జగన్ అన్న వదిలిన బాణం అని అప్పట్లో పాదయాత్ర చేసింది షర్మిల అన్నారు. ఇప్పుడేమో వైఎస్ వదిలిన బాణం అంటున్నారు. జగ్గారెడ్డి ఏ పార్టీలో ఉంటే నీకు ఎందుకున్నారు. జగ్గారెడ్డి ఏ పార్టీలో ఉన్నాడో తెలివి ఉన్న వాళ్లకు తెలుసునన్నారు. నేను పార్టీలు మర్చిన చరిత్ర అంతా ప్రజలకు తెలుసునన్నారు. షర్మిల మమ్మల్ని తిడితే మేము వైఎస్‌ని తిట్టాల్సి వస్తుందన్నారు. మమ్మల్ని గెలుగుడు అన్నారు. టిఆర్ఎస్‌లో పనిచేసుకుంటూ ఉన్న నన్ను పిలిచింది వైఎస్ కాదా అన్నారు. ఆ సంగతి నీకు తెలియదా? అన్నారు. వైఎస్ చనిపోయినప్పుడు నేను బాగా ఏడ్చానని, తాము బయట ఏడుస్తుంటే ఇంట్లో మీరు సిఎం కావాలంటూ స్కెచ్ వేసుకుంటు న్నారన్నారు. వైఎస్ మీద మా లాంటి వాళ్లకు ప్రేమ ఉందన్నారు. వైఎస్‌ను అభిమానించే వాళ్లలో నేను ఒక్కడిని అన్నారు. వైఎస్ 1978లో రెడ్డి కాంగ్రెస్‌లో ఎమ్మెల్యేగా గెలిచారు. రెడ్డి కాంగ్రెస్ నుంచి మళ్లీ కాంగ్రెస్‌లోకి రాలేదా అన్నారు. షర్మిల బిజెపి బాణం అని నాకు అనుమానం ఉందన్నారు. అప్పుడేమో జగన్ అన్న వదిలిన బాణం అన్నావన్నారు. షర్మిల బిజెపిని ఇప్పటి వరకు తిట్టినట్లు చూడాలేదన్నారు. మోడిని ఎందుకు వైఎస్ షర్మిల విమర్శించడం లేదని, ప్రశ్నించడం లేదన్నారు. వంద శాతం బిజెపి వదిలిన బాణం అన్నారు. జగన్ బిజెపి మనిషే కదా అన్నారు. హైదరాబాద్‌లోని ఏపి ప్రజల ఓటు బ్యాంకు కాంగ్రెస్‌కు పోకుండా అడ్డుకునే పనిలో షర్మిల ఉందన్నారు. జగన్, షర్మిలలు ఇద్దరు బిజెపి డైరక్షన్‌లో ఉన్నారన్నారు.

ఎన్‌టిఆర్ పేరుతో తీసి వైఎస్ పేరు పెట్టి తప్పు చేశారన్నారు. ఎన్‌టిఆర్‌కి తెలుగు ప్రజల్లో మంచి పేరు ఉందన్నారు. వివాదాలతో వైఎస్‌కి చెడ్డపేరు వస్తుందన్నారు. జగన్ అధికారంలోకి వచ్చిన తరువాత ఫ్యాక్షన్ స్టైల్‌లో ఉంటే ఎట్లా అంటూ ప్రశ్నించారు. ఎపికి అమరావతి రాజధానిగా ఉండాలన్నారు. అమరావతి విషయంలో చంద్రబాబు మంచి నిర్ణయం తీసుకున్నారన్నారు. చంద్రబాబు కూడా ఒకప్పుడు కాంగ్రెస్ ఎమ్మెల్యేనే, కాంగ్రెస్‌లో మంర్తఇనే అన్నారు. టిపిసిసి అధ్యక్షులు రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలతో తప్పులేదని, అందరం అన్ని అంటాం, ఇది కాంగ్రెస్‌లో కామన్ అన్నారు. ప్రెసిడెంట్ అంటేనే మా అందరికి పుస్తకట్టినట్లే కదా అన్నారు.

జూబ్లీహిల్స్‌లో కళామందిర్ ప్రారంభం

హైదరాబాద్, సెప్టెంబరు 26, ప్రభాతవార్త: హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో కళామందిర్ షోరూం ప్రారంభమైంది. ప్రముఖ నటి, సామాజిక వేత్త అక్కినేని అమల సోమవారం ఈ షోరూంను ప్రారం భించారు. అలాగే ఈ ప్రారంభ కా ర్యక్రమంలో సా మాజికవేత్తలు కొ ణిదెల శ్రీజ, కొ ణిదెల సుష్మిత, ఫ్యాషన్ డిజైనర్ దివ్యరెడ్డి, కూచి పూడి డ్యాన్సర్ దీపికారెడ్డి, ఫిక్కీ చైర్మన్ శుభామ హేశ్వరి, లగడ పాటి పద్మశ్రీ హాజరయ్యారు. దీంతో సాయి సిల్క్స్ లిమిటెడ్ గ్రూప్స్‌కు చెందిన 49వ కళామందిర్ రాయల్ షోరూమ్ ఏర్పాటైంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటకలో ఉనికి కలిగి ఉన్న చీరల రిటైల్ పరిశ్రమలో ప్రసిద్ధి చెందిన బ్రాండ్ కళామందిర్ గుర్తింపు పొందింది. ఎంపిక చేసుకున్న, ప్రత్యేకమైన పట్టు సేకరణ కోసం కళామందిర్ రాయల్ ప్రసిద్ధి పొందింది. పట్టు, పైఠాని, పటోలా, చేనేత, కోటా, డిజైనర్, ఖాదీ చీరలే కొత్త కళామందిర్ రాయల్‌లో అందుబాటులో ఉంచారు. కళామందిర్ రాయల్ అనేది స్రీలకు చీరల దేవాలయంగా ఉందని ఈ సందర్భంగా కళామందిర్ రాయల్ డైరక్టర్ కల్యాణ్ అన్నారు. మహిళలకు ప్రత్యేకంగా రూపొందించిన చీరలను అందుబాటులోకి తీసుకొస్తుందని చెప్పారు. ప్రతిభావంతులైన నేత కార్మికుల సహకారం, అంతర్గత డిజైనర్లచే చీరలు రూపొందించబడ్డాయన్నారు. కళామందిర్ రాయల్‌లో చీరలు ఇతర డిజైనర్ బ్రాండ్‌లకు భిన్నంగా ఉంటాయని తెలిపారు. సరసమైన ధరలతో అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు. కళామందిర్ రాయల్ అనేది ఒక దైవిక ప్రదేశం అని, దాని ఉత్తత్తులు చాలా సూక్ష్మంగా, సహజంగా రూపొందించబడ్డాయని పేర్కొన్నారు. నగర మహిళలు ఇష్టపడే మొదటి ఎంపిక కళామందిర్ రాయల్ అని వ్యాఖ్యానించారు.

బిసి ఉద్యమంలో ప్రతిఒక్కరూ భాగస్వామ్యం కావాలి

సమావేశంలో అభివాదం చేస్తున్న ఆర్.కృష్ణయ్య, గుజ్జ కృష్ణ, మారేష్ తదితరులు

చట్టసభల్లో 50శాతం రిజర్వేషన్లు సాధించేవరకు దేశవ్యాప్త ఉద్యమం ఆగదు
దక్షిణాది రాష్ట్రాల బిసి సంఘాల సమావేశంలో ఎంపి ఆర్.కృష్ణయ్య

హైదరాబాద్, సెప్టెంబరు 26, ప్రభాతవార్త: తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నట్లే.. బిసి ఉద్యమంలోనూ సబ్బండ వర్గాలు భాగస్వామ్యం కావాలని చట్ట సభల్లో బిసిలకు 50శాతం రిజర్వేషన్లు కల్పించాలని జాతీయ స్థాయిలో ఉద్యమం ఉధృతం చేయాల్సిన అవసరం ఉందని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఎంపి.ఆర్.కృష్ణయ్య తెలిపారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లోని కాచిగూడలో ఆంధ్రప్రదేశ్ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు డాక్టర్ ఎన్.మారేష్ అధ్యక్షతన దక్షిణాధి రాష్ట్రాల ప్రతినిధులు సమావేశం నిర్వహించారు. దీనికి ఆర్.కృష్ణయ్య ముఖ్యఅతిథిగా హాజరుకాగా జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, ఎపి బిసి సంక్షే మసంఘం మహిళా అధ్యక్షరాలు వేముల బేబి రాణి, ప్రధాన కార్యదర్శి పద్మజా, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన బిసి నాయకులు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ ఈ సమావేశంలో బిసి బిల్లుకై కేంద్రంపై ఒత్తిడి తెచ్చేవిధంగా కార్యాచరణ రూపొందించామన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇసిలను బిచ్చగాళ్లలాగా చూస్తుందని బిసి ప్రధాని చేశామని గొప్పలు చెప్పుకుంటూనే 75కోట్లమంది బిసిలను గాలికి వదిలే సిందన్నారు. కేవలం బిసి ప్రధానిని చేస్తే సరిపోదని ఆవర్గానికి చెందిన వారిని సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో ముందుండేలా చర్యలు తీసుకోవాలన్నారు. బిసి బిల్లు సాధనకు గత 40ఏళ్లగా అనేక ఉద్యమాలు చేస్తున్నామని దీనికోసం తొక్కని గడపలేదని చివరి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ స్పందించి బిసిబిల్లు పెట్టిందన్నారు. దీన్ని ఆమోదింపజేయాల్సిన బాధ్యత అన్నిపార్టీలపై ఉందని బిసిల గురించి మాట్లాడే పార్టీలు ఈ బిల్లుకి మద్దతిచ్చి చిత్తశుద్ధి నిరూపించుకోవాలన్నారు. ఈసమావేశంలో వివిధ సంఘాల నాయకులు నీలంవెంకటేష్, రాజేందర్, అనంతయ్య తదితరుల పాల్గొన్నారు.

అధికార దుర్వినియోగానికి పాల్పడుతోన్న టిఆర్ఎస్

టిజెఎస్ అధ్యక్షుడు కోదండరాం

హైదరాబాద్, సెప్టెంబరు 26, ప్రభాతవార్త : సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ పర్యటనల సందర్భంగా పోలీసులు ప్రతిపక్ష పార్టీల నేతలను అక్రమంగా అరెస్టు చేస్తున్నారని టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొ.కోదండరామ్ ఆరోపించారు. తీవ్ర నేరం చేసే అవకాశం ఉన్న వ్యక్తులపై మోపే 151 ప్రకరణ కింద ముందస్తు అరెస్టులకు పాల్పడుతున్నారని విమర్శించారు. సోమవారం ఆయన ఒక ప్రకటనలో మంత్రి కేటీఆర్ ఆదిలాబాద్, ముథోల్ పర్యటన సందర్భంగా అడ్డుకుంటారనే ఉద్దేశ్యంతో టీజేఎస్ నేతలు, కార్యకర్తలను అక్రమంగా అరెస్టు చేసి పలు పోలీస్ స్టేషన్లకు తరలించారని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ఎవరికైనా నిరసన తెలిపే హక్కు ఉందనీ, ఆ విషయాన్ని విస్మరించి సీఎం కేసీర్, మంత్రి కేటీఆర్ పర్యటనలను అడ్డుకుంటారనే ఉద్దేశ్యంతో ప్రతిపక్ష పార్టీలకు చెందిన నేతలు, కార్యకర్తలను ముందస్తు అరెస్టులకు పాల్పడుతున్నారనీ, దీనిపై భవిష్యత్తులో ఉద్యమిస్తామని ఈ సందర్భంగా కోదండరామ్ స్పష్టం చేశారు.